

# కొత్త చీర

శ్రీమతి రాజహంస

ఆ వేళ, అందులోనూ ఆవేళ, సాయంత్రం ఆరు గంటలన్నర అయినప్పటికీ ఆయన యింటికి రాకపోవడం చూసి నాకు మహా చిరాకు వేసింది. వెయ్యదూ మరీ : నిండా పదిరోజులేనా లేదు దసరా. చీరకొనమంటే డబ్బు లేదని మురిపించి, ఆవేళ బ్రహ్మాండం మీద కొనడానికి ఒప్పుకున్నారు.

ఎలాగైతేనేం, ఏడుగంటలు కొడుతూవుంటే చంకలో పొట్లాం పెట్టుకుని దిగేరు.

' ఏదీ, చీర చూదాం '

' చూదాం ? ఏం రాణీదర్జా, చూస్తాను అనకూడదూ...అయినా, చీర ఏదీ చూడడానికి '

' అదేఁవిటా తెచ్చిన పొట్లాం '

ఆయన నవ్వడం మొదలెట్టేరు. నాకు వొళ్లు మండినంత కోపం వచ్చింది.

' ఏఁవీ ఎరగనట్టు, ఎందుకా నటనా?' ఆయన నవ్వడం మానలేదు.

ఇంకా ఇలా మెత్తగా పూరుకోడం ఇష్టం లేక చేతులో పొట్లాం లాగేను.

ఆయన నవ్వు జాస్తి అయింది.

అవి ఆఫీసు కాగితాలు.

నాకు కళ్లంట నీళ్లు తిరిగేయి.

' నీలకంటా (రా)య సర్వేస్వరాయ ' అని సంగీతం ఆరంభించేరు.

' ఆ పొట్లాం కాగితాలని చెప్పకూడదూ నే నడిగినప్పుడు '

' చీరతే లేదని చెప్పేనుకానూ '

ఇంతలో అవతలనుంచి కేక

' బాబూ, ఆఫీసులో పొట్లాం, మర్చిపోయారండి '

నాకన్న ముందు పరిగెట్టి అందుకుని దయ చేసేరు.

' చీర చిత్తగించండి '

' తెలేదేమో '

' ఇప్పుడు తెస్తే...'

ఎంతో ఆప్యాయంగా మడత విప్పేరు.

చీర వెల వెల బోతూవుంది.

' కాపదానికి, పండక్కి చీర పెట్టాలికదూ. అందుకు కొనేసి నట్టున్నారు '

' మీ ఆడవాళ్లకున్న లక్షణంవే యిది '

' మీ మగాళ్ళకున్న గుణంవే యిది '

' ఎంత మంచి చీర తెచ్చినా నచ్చదు '

' నచ్చే చీర ఎన్నడూ తేరు '

ఆయనకి బాగా కోపం వచ్చింది.

' ఈ చీర నచ్చలేదా ?'

"..............."

' ఇది కావాలా అక్కర్లేదా '

"..............."

' చీర రేపు వాపసు చేసేస్తాను '

' చేసేండి ! ఆరంగు అసహ్యంగా వుంది... వీధులోకి అమ్మ వస్తాయి, నేను కొనుక్కుం టాను, డబ్బియ్యండి '

' వాడు రూపాయి కర్ధలు టోపీ. నేనయి మరీ చీర మార్చను '

' నాకిది అక్కర్లేదు '

మర్నాడు చీర పట్టుకొని వెళ్లిపోయేరు. నాల్రోజులైంది : చీర వూసేనా ఎత్తలేదు. వూళ్లోనే వున్నవాళ్ల చెల్లెలికీ బావకీ చీరా చాపూకొని పెట్టాలని చెపితే, అలాగే అని వూరుకున్నారు. పోనీ అప్పుడేనా నాచీర వూసు ఎత్తిన పాపాన పోలేదు. వుక్రోషం కొద్దీ నేనింక ఆమాటే ఎత్త దల్చుకో లేదు.

రేపు దసరా అనగా :

ఇంట్లో వండుకుంటున్నాను.

' ఇదుగో, ఇలా మాట ' అని కేక.

టేబిలుమీద, దీపందగ్గర మిలమిల మెరిసి పోతూ, లేతగులాబీ రంగుమీద నీలిపువ్వు లద్దిన చీరా పాముమీసంలాంటి పంచల చాపూ వున్నాయి.

' ఇవి చూడూ, మా చెల్లికీ, బావకీ అని కొన్నాను. ఎలా వున్నాయి ?'

నాకు వళ్ళు గిర్రుని తిరిగింది. కోపంకూడా వచ్చింది.

' మీవాళ్ళకోసం అంటే, మంచివి దొరుకు తాయి '

' మరొకళ్ల కంటే నచ్చుతాయి '

' నాకంటే మంచివి తేరు '

' అయితే యీ చీర నచ్చిందంటావా '

' ఏం లాభం '

మారు మాటాడలేదు. వూరుకున్నారు.

నాకుమాత్రం, చీరమీద కోరికెక్కువైంది.

' నా కలాంటి చీర కొనిపెట్టరూ ' అని బతిమాలు కున్నాను.

ఎలాగైతే నేమి, ఆ చీర నాకిచ్చేడానికీ, మరో చీరకొని వాళ్ళచెల్లి కివ్వడానికీ వప్పు కున్నారు.

తెల్లారింది. అభ్యంగనాలు పూర్తిచేసు కున్నాం.

నేను చీరకట్టుకొనే సరికి, ఆయన కొత్త పంచ కట్టుకుం టున్నారు.

'ఆ పంచల చాపు మీ బావకి కదూ'

ఆయన నవ్వుతూ అన్నారు కదా

'ఇవి మనకేలంటే నీకు నచ్చవుకదా అని ఇలా చేసేను; అసలుమాట ఏమిటంటే, మొన్న తెచ్చినచీర పదిరూపా యలది. ఆ సొమ్ముకే, నీకు నచ్చిన యీ చీరా, యీ పంచల చాపూ, కూడా వచ్చేయి'

---



వజ్రములు, రంగూన్ కెమలములు డాజిలో డైమెండ్లు, పుష్యరాగములు, పచ్చలు, నగలు
దొరుకు చోటు
# పి. గోపాలస్వామి నాయుడు & సన్స
నెం. 5 పుదుపేట వీధి: పరింగిమలై పోస్టు : మద్రాసు